క్లుప్తంగా

నేటి నుంచి నీలావడి అగ్నిగంగమ్మ జాతర



నీలావడి అగ్నిగంగమ్మ

పార్వతీపురం రూరల్: ఉత్తరాంధ్రుల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న నీలావడి అగ్నిగంగమ్మ అమ్మవారి జాతర సోమవారం నుంచి ప్రారంభం కానుంది. ఆంధ్ర–ఒడిశా సరిహద్దుల్లో ఉన్న నీలావడి గ్రామానికి ఒడిశాతో పాటు ఉత్తరాంధ్రలో ఉన్న పలు జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులను చెల్లించుకోనున్నారు. ఈనెల 10 నుంచి 18వ తేదీవరకు అగ్నిగంగమ్మ జాతరను నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు.

ఆర్టీసీ డీఎం బాధ్యతల స్వీకరణ



నూతన డీఎంగా బాధ్యతలు స్వీకరిస్తున్న బీఎస్ఎన్ మూర్తి

సాలూరు: పట్టణంలో ఆర్టీసీ డీఎంగా బీఎస్ఎన్‌మూర్తి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది స్వాగతం పలికారు. గత డీఎం భాస్కరరెడ్డి ఇటీవల ఉద్యోగ విరమణ చేశారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



అదృశ్యమైన రాము

పార్వతీపురంరూరల్: పార్వతీపురం మండలంలోని నర్సిపురం గ్రామానికి చెందిన పి.రాము గత నెల 22 నుంచి ఆచూకీ లేకపోవడంతో పార్వతీపురం రూరల్‌స్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై బి.సంతోషి తెలిపారు.

అరకును రెండు పార్లమెంట్ స్థానాలు చేయండి

గుమ్మలక్ష్మీపురం: అరకు పార్లమెంట్‌ను రెండు పార్లమెంట్ నియోజకవర్గాలుగా చేయాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ ఓ ప్రకటనలో ఆదివారం డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఏడు అసెంబ్లీ స్థానాలతో భౌగోళికంగా పాలనకు ఇబ్బందికరంగా ఉన్న అరకు పార్లమెంట్ స్థానాన్ని డీ–లిమిటేషన్‌లో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లా పార్లమెంట్ స్థానంగా, అల్లూరి సీతారామరాజు జిల్లా పార్లమెంట్ స్థానంగా విభజించాలని కోరారు. అలాగే విశాఖపట్నంలోనే గిరిజన సంక్షేమ శాఖ రాష్ట్ర కార్యాలయం ఏర్పాటు చేస్తే ఇక్కడ అధికంగా ఉన్న గిరిజనులకు ఉపయోగకరమన్నారు.

హెల్మెట్‌ధారణ తప్పనిసరి



అవగాహన కల్పిస్తున్న ఏఎస్సై సంజీవ్, తదితరులు

సీతంపేట: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఏఎస్సై సంజీవ్ అన్నారు. ఆదివారం స్థానిక వారపు సంత వద్ద వాహనదారులకు అవగాహన కల్పించారు. మైనర్లకు వాహనాలు నడపడానికి ఇవ్వవద్దన్నారు. లైసెన్స్‌లు కలిగి ఉండాలన్నారు. అలాగే సైబర్ నేరాలపై వివరించారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్సై శిరీషా పాల్గొన్నారు.

సిరుల యాత్రకు పోటెత్తిన భక్తులు

వీరఘట్టం: మండల కేంద్రంలోని సాయినగర్‌లో రెండు రోజులుగా జరుగుతున్న సిరుల యాత్ర ఆదివారంతో ముగిసింది. యజ్ఞకర్త ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉత్సవాల్లో చివరి రోజైన ఆదివారం భక్తులు పోటెత్తారు. ఎల్లమ్మ, పోతన్నలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఎస్సై జి.కళాధర్ బందోబస్తు నిర్వహించారు.

గ్రామ స్వరాజ్యమా నీవెక్కడ?


- సర్పంచ్‌ల అధికారాలను కాలరాసిన కూటమి ప్రభుత్వం
- తెలుగు తమ్ముళ్లకే గ్రామాల్లో పనుల అప్పగింత



బలిజిపేటలో నిర్మించిన సీసీ రోడ్డు

బలిజిపేట: ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన సర్పంచుల అధికారాలు, హక్కులను కూటమి ప్రభుత్వం కాలరాసింది. వారికి పవర్ లేకుండా చేస్తూ సర్పంచ్‌ల వ్యవస్థను నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తోంది. తాము అధికారంలోకి రాగానే సర్పంచ్‌లకు అన్ని అధికారాలు ఇచ్చేస్తామని చెప్పి నమ్మించిన కూటమి ప్రభుత్వం అధికారంలో అడుగుపెట్టిన వెంటనే సర్పంచ్‌లకు పవర్ లేకుండా చర్యలు తీసుకుంటోంది. సర్పంచ్ గ్రామ ప్రథమ పౌరుడు. గ్రామంలో ఏపని చేయాలన్నా ఆయన అనుమతితో చేయాల్సి ఉంటుంది. ఆ అధికారాన్ని కూటమి ప్రభుత్వం కాలరాసింది. జాతీయ ఉపాధి హామీ పథకం కింద ఇటీవల గ్రామ పంచాయతీల్లో సీసీరోడ్లు, వీధి కాలువలు, పాఠశాలలకు ప్రహరీలు మంజూరు చేశారు. వాటికి సర్పంచ్ అప్రూవల్ ఇవ్వాల్సి ఉన్నప్పటికీ వారిని తోసిరాజని ఆటకట్టేచందంగా వారి అధికారాలను పక్కన పెట్టేశారు. జాతీయ ఉపాధి హామీ పథకం ఏపీఓ, ఫీల్డ్ అసిస్టెంట్, లేదంటే గ్రామంలో కూటమి పార్టీలకు చెందిన సీనియర్ సిటిజన్ అప్రూవల్ తీసుకుని గ్రామంలో టీడీపీ నాయకులకు పనులు అప్పగించి చేయిస్తున్నారు. దీనికి సంబంధించిన బిల్లులు నిబంధనల మేరకు సర్పంచ్ ఖాతాలోనే జమ చేయాల్సి ఉంది. సర్పంచ్‌కు ఉన్న అధికారాలన్నీ తీసేసి ఎవరైతే పనులు చేస్తారో వారి ఖాతాకే బిల్లులు జమ చేసే విధంగా అధికార దుర్వినియోగం చేశారనే విమర్శలు ఉన్నాయి. ఈ ప్రకారం రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కూటమి నాయకులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధం చేస్తోందని పలువురి అభిప్రాయం. గ్రామపంచాయతీల్లో మెజారిటీ సర్పంచ్‌లు వైఎస్సార్‌సీపీ వారే కావడంతో కూటమి ప్రభుత్వం కుట్రకు తెరలేపింది.

కూటమి మేత



చాకరాపల్లిలో నిర్మించిన సీసీ రోడ్డు

బలిజిపేట మండలంలో గల 24పంచాయతీల్లో రూ.205.05లక్షలతో 40పనులకు ప్రతిపాదనలు చేసి వాటిని కూటమి నాయకులే చేస్తున్నారు. వాటిలో టీడీపీ నాయకులే ఎక్కువ మంది చేస్తున్నారు. జనసైనికులకు మొండిచేయి చూపించారనే అంతర్మథనంతో ఆ పార్టీ నాయకులు కుంగిపోతున్నట్లు సమాచారం. ఏది ఏమైనా కూటమి ప్రభుత్వం కక్ష సాధింపుతో పనిచేస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తోందని వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లు విమర్శిస్తున్నారు.

సర్పంచ్‌ల ప్రమేయం లేకుండా పనులు

గత సంవత్సరం ఆగస్టులో గ్రామసభ ద్వారా తీర్మానం చేశాం. ఆ తరువాత సర్పంచ్ ఆమోదం లేకుండా పంచాయతీలో కూటమి సభ్యులు పనులు చేస్తున్నారు. అధికారులు వారికి వత్తాసు పలికి పనులు చేయిస్తున్నారు.

–మోహనరావు, పి.చాకరాపల్లి సర్పంచ్, బలిజిపేట మండలం

కేటరాక్ట్‌కు 56 మంది ఎంపిక



కటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

సీతానగరం: గ్రామాల్లో కంటి వ్యాధితో ఇబ్బందులు పడుతున్న వారికి శంకర్‌ఫౌండేషన్‌లో ఉచితంగా నేత్రాలకు శస్త్రచికిత్స చేయనున్నట్లు డాక్టర్ జాక్సన్ అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో స్థానిక డాక్టర్‌లు పి.ఉష, పి.పావనిల పర్యవేక్షణలో శంకర్ ఫౌండేషన్ (విశాఖ)క్యాంప్ మేనేజర్ సీహెచ్‌వెంకట రమణ ఆధ్వర్యంలో ఆదివారం ఉచితనేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జాక్సన్ మాట్లాడుతూ సిబ్బంది సహకారంతో చినభోగిలి, పెదభోగిలి, బుడ్డిపేట, బక్కుపేట గ్రామాలకు చెందిన 89 మంది కంటివ్యాధి గ్రస్తులు శిబిరంలో పాల్గొనగా వారందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి 56 మందిని కేటరాక్ట్ శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశామని తెలిపారు. ఎంపికైన వారిని శంకర్‌ఫౌండేషన్ బస్సులో తరలించి శస్త్ర చికిత్స అనంతరం మండలకేంద్రానికి అప్పగించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో క్యాంప్ కో ఆర్డినేటర్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన వారిని శిక్షించాలి



సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తున్న వీడియో

పార్వతీపురం రూరల్: పట్టణంలోని జగన్నాథపురానికి చెందిన ఆర్. దుర్గాప్రసాద్‌పై దాడిచేసిన ఐదుగురు వ్యక్తులను శిక్షించాలని బాధితుడి కుటుంబ సభ్యులు కోరారు. పట్టణంలోని దేవాంగుల వీధి కూడలి వద్ద ఈనెల 7న యువకుడిపై ఐదుగురు వ్యక్తులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన పాఠకులకు విదితమే. ఈ ఘటనకు సంబంధించి వీడియోలు సామాజిక మాధ్యమాల్లో ఆలస్యంగా వెలుగులోకి వచ్చి హల్‌చల్ చేస్తున్నాయి. దాడికి సంబంధించిన దృశ్యాలు కుటుంబసభ్యులు, స్నేహితులు చూసి చలించిపోయారు. ఈ ఘటనకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు, స్నేహితులు కోరుతున్నారు.

ఘనంగా గావుపండగ సంబరాలు



తప్పెటగుళ్లతో పాటలు ఆలపిస్తున్న కళాకారులు

సీతానగరం: మండలంలోని సూరంపేటలో యాదవ కులస్థుల కుటుంబాలు నిర్వహించే గోవపండగ సంబరాలు ఆదివారం ముగిశాయి. యాదవ కులస్థులు ఆరాధ్య దైవంగా పూజించే గోవ(గంగమ్మ) పండగను నాగళ్ల కుటుంబీకుల ఆధ్వర్యంలో ఏడాది విడిచి ఏడాది వంతున నిర్వహిస్తారు. ఈ మేరకు నిర్వాహకుడు సురేష్ ఆధ్వర్యంలో ఇంటినుంచి ఆలయం వరకు యాదవ కులస్థుల పర్యవేక్షణలో తప్పెటగుళ్లతో కళాకారులు తిరువీధి చేశారు. అందరి సమన్వయంతో గంగమ్మ ఆలయానికి గ్రామ పెద్దలు నాగళ్ల అప్పయ్య, గంగరాజు, సత్తయ్య, సింహాచలం గంగయ్య, గౌరి, అప్పయ్య, నాగరాజు సురేష్ అమ్మవారిని సాగనంపారు.

రవాణా చార్జీలు చెల్లించాలి

పాలకొండ: రైతులు విక్రయించిన ధాన్యానికి సంబంధించి రవాణా చార్జీలు చెల్లించాలని రైతు సంఘ నాయకుడు బుడితి అప్పలనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సీజన్‌లో సొంత ఖర్చులతో రైతులు ధాన్యం రవాణా చేసుకున్నారని పేర్కొన్నారు. దీంతో పాటు గోనెలకు సంబంధించిన డబ్బులను రైతుల ఖాతాలో జయ చేయాలని కోరారు.

సంతాపం..

వీరఘట్టం: మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, రిటైర్డ్ హెచ్ఎం లెకం అప్పలనాయుడు (81) ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, జెట్పీటీసీ సభ్యురాలు జంపు కన్నతల్లి తమ సంతాపాన్ని తెలియజేశారు. ఆ కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని పేర్కొన్నారు.

అర్ధ శతాబ్దం తర్వాత జ్ఞాపకాల ఒడిలో..



గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1974–75 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం జరిగింది. యాభై ఏళ్ల తర్వాత వారంతా కలుసుకోవడంతో ఒకరినొకరు ఆలింగనం చేసుకుని, ఎంతో ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఆనాటి తమ తీపి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని సరదాగా గడిపారు. అనంతరం అప్పట్లో తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. విద్య నేర్పిన గురువులు, చదువుకున్న బడికి ఎప్పుడూ రుణపడి ఉండాలని అన్నారు. డి.పారినాయుడు, సింహాచలం మాస్టారు, తదితరులు పాల్గొన్నారు.

నేడు లక్ష్మీ గణపతి దేవాలయ వార్షికోత్సవం

సీతంపేట: మండల కేంద్రంలోని లక్ష్మీ గణపతి దేవాలయ 46వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధానార్చకుడు వేమకోటి సాయికృష్ణ శర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం సుప్రభాతసేవ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలు చేపట్టిన అనంతరం అన్నదానం చేపడతామని పేర్కొన్నారు. అలాగే ఈ నెల 11వ తేదీన తిరువీధి కార్యక్రమం ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పరీక్ష కేంద్రం ఎత్తివేత దుర్మార్గం

- ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్



సీతానగరం: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1982నుంచి ఏటా నిర్వహించే పదో తరగతి పరీక్షాకేంద్రాన్ని ఈ ఏడాది ఫర్నిచర్ లేదన్న నెపంతో రద్దు చేయడం దుర్మార్గమైన చర్య అని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బి.రవికుమార్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగంపట్ల కూటమి ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి ఉందో ఇదే ఒక నిదర్శన మన్నారు. ఫర్నిచర్ సదుపాయం లేకపోతే విద్యార్థులు ఇంతవరకు ఎక్కడ కూర్చున్నారని ప్రశ్నించారు. ఫర్నిచర్ సదుపాయం లేకపోతే కల్పించవలసిన బాధ్యత ప్రభుత్వానికి లేదా? నాటి నుంచి నేటివరకూ ఇక్కడ పరీక్షలు నిర్వహించలేదా అని ప్రశ్నించారు. మండల కేంద్రంలో పరీక్షా కేంద్రాన్ని తీసివేసి దూరంలో ఉన్న జోగింపేటలో పెట్టడం ఎంతవరకు సమంజసమన్నారు. తక్షణమే స్కూల్‌లో ఫర్నిచర్ ఏర్పాటుచేసి యథావిధిగా హైస్కూల్‌ను పరీక్షా కేంద్రంగా కొనసాగించాలని కోరారు. రద్దు చేస్తున్న పరీక్షా కేంద్రాలపై దశలవారీగా ఆందోళన చేస్తామని స్పష్టం చేశారు.

విస్తృత పోరాటాల ద్వారానే మహిళలకు విముక్తి



మాట్లాడుతున్న నాయకురాళ్లు

సాలూరు: విస్తృత పోరాటాల ద్వారానే మహిళలకు విముక్తి కలుగుతుందని ఐద్వా జిల్లా కార్యదర్శి శ్రీదేవి, శ్రామిక మహిళా సంఘం జిల్లా నాయకురాలు రామలక్ష్మి అన్నారు. ఈ మేరకు సాలూరు పట్టణంలో ఆదివారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళాదినోత్సవ సదస్సులో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సమాజంలో మహిళలపై జరుగుతున్న లింగ, వర్ణ అణిచివేత నిర్మూలన , మహిళా విముక్తి కోసం విస్తృత పోరాటాలు నిర్వహించి వాటిలో మహిళలను భాగస్వామ్యం చేయడం ద్వారానే జరుగుతుందన్నారు. మహిళలకు పని ప్రదేశాలలో నేటికీ భద్రత లేదని, ప్రతిచోటా ఏదో ఒక రూపంలో వేధింపులు జరుగుతూనే ఉన్నాయన్నారు. నేటి సమాజంలో మహిళలంతా ఎక్కడ ఉన్నా ఐక్యంగా ప్రశ్నించే ఎదిరించే తత్వంతో ముందుకు నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, నాయకురాళ్లు తదితరులు పాల్గొన్నారు.

ఒకే పట్టణం, ఒకే ఆటో..ఒకే నంబర్



ఆటోలకు కేటాయించిన నంబర్లను చూపిస్తున్న సీఐ అప్పలనాయుడు, పక్కన ఆటో డ్రైవర్లు తదితరులు

సాలూరు: ఒకే పట్టణం, ఒకే ఆటో, ఒకే నంబర్ విధానానికి పోలీసులు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలో సీఐ అప్పలనాయుడు ఆధ్వర్యంలో పట్టణంలోని ఆటోలకు నంబర్లు కేటాయించి అతికించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ..ఎస్పీ ఆదేశాల మేరకు ఈ విధానం అమలుచేస్తున్నామని తెలిపారు. పట్టణ పరిధిలో ఉన్న అన్ని ఆటోయూనియన్లు, వాటి పరిధిలో గల ఆటోలకు ఒకే పట్టణం, ఒకే ఆటో, ఒకే నంబర్ విధానం అమలుచేస్తూ అన్ని ఆటోలకు సీరియల్ నంబర్లు ఇచ్చినట్లు చెప్పారు.

ఎందుకంత ప్రేమంట..!



వైఎస్సార్‌విగ్రహానికి వేసి ఉన్న ముసుగు



ఎన్‌టీఆర్ విగ్రహానికి తీసివేసిన ముసుగు

సాలూరు: అధికార కూటమి ప్రభుత్వ సేవలో తరలిస్తున్న పలువురు అధికారులు ఎన్నికల కోడ్ ముగిసిందన్న విషయాన్ని కూడా మరిచిపోతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విమర్శలకు కారణం, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఇటీవల ముగిసింది. దీంతో పట్టణంలోని వెంకటేశ్వర డీలక్స్ సమీపంలో ఉన్న ఎన్‌టీఆర్ విగ్రహానికి ముసుగును తొలగించారు. ఇదే క్రమంలో పట్టణంలోని మెయిన్‌రోడ్డు వద్ద ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి ఉన్న ముసుగును తొలగించకుండా వదిలేశారు. ఈ రెండింటిని గుర్తించిన ప్రజలు అధికారుల తీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు.

యువత పోరుకు సన్నద్ధం

- ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలకు డిమాండ్
- ఈ నెల 12న జిల్లా కేంద్రంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ధర్నా
- మాజీ ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇవ్వకుండా విద్యార్థులను వేధిస్తున్న కూటమి సర్కారుపై వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మరో పోరాటానికి సిద్ధమవుతున్నట్లు మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి తెలిపారు. ఆదివారం ఆమె వండువలోని స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఈ నెల 12న జిల్లా కేంద్రంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చేపట్టనున్న యువత పోరు ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 12న వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వీరఘట్టం మండల కేంద్రంలో ర్యాలీ చేపట్టి అక్కడి నుంచి పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రానికి చేరుకుని కలెక్టరేట్‌ను ముట్టడిస్తామన్నారు. పేద కుటుంబాల విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకుండా ఆర్థిక ఇబ్బందులకు గురిచేయడం కూటమి ప్రభుత్వానికి తగదన్నారు. అమ్మ ఒడి, వసతి దీవెన, విద్యాదీవెన నిలిపివేసి విద్యార్థుల ఆశలపై కూటమి ప్రభుత్వం విషం కక్కుతోందన్నారు. విద్యార్థులకు చెల్లించాల్సిన రూ.3,900 కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. యువత పోరు కార్యక్రమంలో యువత, విద్యార్థులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

మరీ ఇంత అధ్వానమా..!



వండువ సమీపంలో రోడ్డుపై గుంతలు ఉండడంతో ఓ పక్క నుంచి వెళుతున్న వాహనదారులు



వండువ సమీపంలో మరో చోట రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న గుంత



నవగాం సమీపంలో మరో చోట రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న గుంత



నవగాం సమీపంలో అధ్వానంగా ఉన్న రోడ్డు

సంక్రాంతి పండగ లోపు రోడ్లన్నీ బాగు చేస్తామని కూటమి నాయకులు ఎంతో గొప్పగా చెప్పుకున్నారు. తీరా పండగ వెళ్లిపోయి దాదాపు 50 రోజులు పూర్తి కావస్తోంది. అయినప్పటికీ మండల కేంద్రంలోని సీఎస్‌పీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టలేదు. ఈ రోడ్డులో వండువ జంక్షన్ నుంచి నవగాం వరకు ఉన్న రోడ్డు అధ్వానంగా మారింది. ప్రతిరోజూ సెల్ఫ్ యాక్సిడెంట్లు అవుతున్నా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించడం లేదు. రహదారి దుస్థితిపై పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సీఎస్‌సీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వాహన చోదకులు కోరుతున్నారు.

– వీరఘట్టం